క్లుప్తంగా

అయ్యప్పస్వామి సేవలో జెడ్పీ చైర్మన్



ఇరుముడి చెల్లిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సదుం: మండలంలోని కోటమల్లై అయ్యప్ప స్వామి ఆలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శుక్రవారం సందర్శించారు. అయ్యప్ప దీక్షలో ఉన్న ఆయన స్వగ్రామంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టారు. అక్కడి నుంచి అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఇరుముడితో మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ



పల్లకిలో ఊరేగుతున్న రాళ్లగంగమాంబ

గుడుపల్లె: మండలంలోని ఒంటిపల్లె గ్రామ సమీపంలోని ప్రసన్న శ్రీ రాళ్లగంగమాంబ అమ్మవారికి శుక్రవారం పుష్పపల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. పదిరోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ సేవను నిర్వహించారు. ఆలయ ఆవరణలో రంగు రంగుల పుష్పాలతో పల్లకిని ప్రత్యేకంగా అలంకరించి, అందులో రాళ్లగంగమాంబ, ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ పుష్పపల్లకిని ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం బాణసంచా కాల్చుతూ బాణు వేడుకలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.. భక్తుల వినోదం కోసం ఆలయ ఆవరణంలో తమిళనాడు నుంచి నయ్యాండి డ్యాన్సులు, హైదరాబాద్ బృందంతో ఢీ షోలు నిర్వహించారు. శనివారం ఆలయంలో పచ్చిగెరిగె అగ్నిగుండం, అమ్మవారు సింహవాహనంపై ఊరేగింపు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బైరెడ్డిపల్లెలో కేంద్ర బృందం పర్యటన



బైరెడ్డిపల్లెలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని జలజీవన్, స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారి అన్బలగన్ తెలిపారు. బైరెడ్డిపల్లెలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. గత ఏడాది జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును, అందులో నీటి శుభ్రతను పరిశీలించారు. ట్యాంకు నుంచి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తున్నారా, లేదా? అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొళాయిల తాగునీరు అందరికీ అందుబాటులో ఉందా, లేదా? అని ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించారు. తాగునీటి ట్యాంక్ నీటిని పీహెచ్, ఫ్లోరైడ్, క్లోరైడ్, క్లోరినేషన్ టెస్టులు అందరి సమక్షంలో కమిటీ సభ్యులతో చేయించి స్వచ్ఛమైన నీరు అని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, డీఈ స్టాలిన్, ఏఈఈ లోకనాథం, సర్పంచ్ వెంకటేష్, పంచాయితీ కార్యదర్శి సదాశివయ్య, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ బాల సుందరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి ఎంఆర్‌సీలు సురేష్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు

20న ఉచిత వైద్యశిబిరం

పుంగనూరు: స్థానిక బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో ఈనెల 20న ఉదయం 10 గంటల నుంచి వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి పూల హేమంత్ రాయల్ తెలిపారు. శిబిరంలో బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్‌స్పెషాలిటీ వైద్య బృందం రోగులను పరీక్షిస్తుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా జడ్జికి న్యాయశాఖ ఉద్యోగుల ఆత్మీయ స్వాగతం



స్వాగతం చెబుతున్న న్యాయశాఖ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన అరుణ సారికను జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలో జడ్జిని కలిసి శాలువ కప్పి సన్మానించి స్వాగతం పలికారు. న్యాయశాఖ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు గోపినాథ్‌రెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, లక్ష్మీపతి, గణేష్, బాలసుందర్, రవీంద్రరెడ్డి, రాజేష్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, దిలీప్, యువరాజ్, రెడ్డెప్ప, చంద్రశేఖర్, పవనకుమారి, భ్రమరాంబ, హేమ, మినిమా రాయల్ తదితరులు జిల్లా జడ్జిను కలిశారు.

తండ్రీ.. నా ఆత్మను నీకప్పగించుచున్నాను..!

- ఉపవాస దీక్షలతో 'గుడ్ ఫ్రైడే'
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకున్న యేసుక్రీస్తు శిలువ ఘట్టం ప్రదర్శన



పలమనేరు: యేసుక్రీస్తు శిలువ ఘట్టంపై ప్రదర్శిస్తున్న లఘు నాటిక

పలమనేరు: కరుణ, ప్రేమ, త్యాగం యేసుక్రీస్తు ప్రబోధించిన మార్గాలని, ఆ కరుణామయుని బాటలో ముందుకు సాగాలని స్థానిక సెయింట్ లూయిస్ చర్చి ఫాదర్లు వాక్యసందేశమిచ్చారు. పలమనేరులో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఉపవాస దీక్షలతో నిర్వహించారు. స్థానిక సెయింట్ లూఈస్ చర్చిలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలతో పాటు జీసస్‌ను శిలువచేసే ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు లఘు నాటిక రూపంలో ప్రదర్శించారు. శిలువధారియైన యేసుక్రీస్తు, యేసుక్రీస్తుతో పాటు శిలువ వేయబడిన ముగ్గురు దొంగలు, రోమన్ సైనికులు..ఆయా పాత్రలకు రక్తి కట్టించారు. టీఎస్ అగ్రహారం రోడ్డులోని పాదర్స్ బంగ్లా రోమన్ క్యాథలిక్ చర్చి జబారీ నుంచి ఏసుశిలువను మోసుకుంటూ పట్టణంలో ప్రదర్శన చేశారు. స్థానిక లైట్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీ కార్నర్ స్టోన్ చర్చి ఫాదర్ రెవరెండ్‌శామ్యూల్..పాప పరిహారమే గుడ్‌ఫ్రైడే పరమార్థమని వాక్యసందేశమిచ్చారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి ప్రత్యేకంగా, లోతుగా చర్చించారు. ఆ మాటల సారాంశాన్ని జీవితానికి అన్వయించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. బైబిల్ గ్రంథం ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యేసుక్రీస్తు శిలువ ప్రస్థానం సాగిందన్నారు. 'తండ్రీ..నా ఆత్మను నీకప్పగించుచున్నాను' అని శిలువపై పలికిన మాటల్లో పరమార్థాన్ని వివరించారు. ఏడు మాటలపై ప్రత్యేక ఉపన్యాసాలు ముగిశాక ఉపవాస దీక్షలు విరమించారు. చర్చి నిర్వాహకులు, పట్టణంలోని క్రైస్తవులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో నాగపాళెంలోని సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చితో పాటు పలు చర్చిలలో శుక్రవారం ఉపవాస దీక్షలతో గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ రాకేష్ నిమ్రోద్ గుడ్ ఫ్రైడే ప్రత్యేకతపై వాక్య సందేశమిచ్చారు. అలాగే యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి ప్రత్యేక ఉపన్యాసాలు ఇచ్చారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భరత్ భూషణ్, సురేష్ క్రిస్టఫర్, సత్యరాజ్, కృపాకర్, సురేష్, కమలకుమారి, ఆర్థర్ పాల్, హేమలత, సుమిత్ర, భారతి, సరళ, ప్రభావతి, దీనమ్మ, రూప, కమలమ్మ, రవి, చిట్టి, దేవదాసు, ఎస్తేర్‌రాణి, సందీప్, సుధాకర్, మధుబాల, సుకన్య, దీపిక, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: యేసుక్రీస్తు శిలువ వేయబడిన దినం పురస్కరించుకుని శుక్రవారం బైరెడ్డిపల్లె చర్చిల్లో ఉపవాస దీక్షలతో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్లు గుడ్ ఫ్రైడే ఉన్న ప్రాధాన్యతపై వాక్య సందేశమిచ్చారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి ప్రత్యేకంగా ధ్యానించారు. మానవాళి పాప విమోచనార్థం యేసుక్రీస్తు శిలువ వేయబడ్డారని, ఎదుటి వారి కష్టాలను పంచుకోవడంలోనే శాంతి ఉందనే పరమ సత్యాన్ని చాటడానికే క్రీస్తు సిలువనెక్కి రక్షకుడయ్యాడని పాస్టర్ శామ్యూల్ తెలిపారు. మధ్యాహ్నం మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు స్వీకరించి ఉపవాస దీక్షలు విరమించారు.



పలమనేరు: గుడ్‌ఫ్రైడే వాక్య సందేశమిస్తున్న ఫాదర్ రెవరెండ్ శామ్యూల్



పుంగనూరు: సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రాకేష్ నిమ్రోద్‌తో క్రైస్తవులు



బైరెడ్డిపల్లె చర్చి వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నోటీస్ బోర్డు

• నేడు ఉచిత వైద్య శిబిరం

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పీహెచ్‌సీ వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మహతి ఫౌండేషన్ చైర్మన్ అమెరికా నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు అన్ని రకాలైన వ్యాధులకు చికిత్స చేస్తారని, ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని తెలియజేశారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్ కార్డులను వెంటతెచ్చుకోవాలని కోరారు.

• దళిత సంఘాల సమావేశం రేపు

సదుం: స్థానిక వీఆర్‌ఆర్ కాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం దళిత సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ వెంకటస్వామి, సీతాపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో నూతన అంబేడ్కర్ భవన నిర్మాణం, అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. అలాగే కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పలమనేరు: మండలంలోని మొరం గ్రామ సమీపంలోని పెద్దపులి గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఊరి మెరవణి కార్యక్రమాలను నిర్వాహకులు వై రమేష్ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సిబ్బంది



పలమనేరు: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

పుంగనూరు: ప్రస్తుత వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు అన్నారు. శుక్రవారం ఆయన పెట్రోల్ బంకుల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ పట్టే సమయంలో సిగరెట్లు, బీడీలు కాల్చడం, సెల్‌ఫోన్‌తో మాట్లాడటం చేయరాదన్నారు. అలాగే గ్యాస్‌ను మంటలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉంచాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని పలు పెట్రోలు బంకుల వద్ద స్థానిక ఫైర్ శాఖ శుక్రవారం అగ్ని ప్రమాదాలపై అవగాహణ కల్పించింది. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బంకుల వద్ద అగ్నిప్రమాదాలు జరక్కుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, జరిగితే తీసుకోవాల్సిన చర్యలను విపులంగా అక్కడి సిబ్బందికి వివరించారు. ఆపై వారోత్సవాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక ఫైర్ ఆఫీసర్ మనోగరన్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ

- స్కూల్ గోడను ఢీకొని బోల్తా
- లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు



గాయపడిన డ్రైవర్



ప్రహరీ గోడను ఢీకొని బోల్తా పడిన లారీ

వి.కోట: వి.కోట–పలమనేరు జాతీయ రహదారి లోని కొమ్మర మడుగు క్రాస్ ప్రమాదాలకు నిలయంగా మారింది. శుక్రవారం వి.కోట వైపు నుంచి పలమనేరు వైపు అగ్గిపెట్టెల లోడుతో వెళ్తున్న రాజస్తాన్‌కు చెందిన లారీ కొమ్మరమడుగు క్రాస్ వద్ద అదుపుతప్పి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ మొసమ్(25) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తరచూ ఈ క్రాస్‌లో ప్రమాదాలు జరుగుతున్నా జాతీయ రహదారుల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ముస్లింల ఆందోళన



వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని ర్యాలీ చేస్తున్న ముస్లింలు

–వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్

సదుం: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు–2025ను వెంటనే రద్దు చేయాలని ముస్లిం మైనారిటీలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మదీనా, జామియా, జాండ్రపేట ఇఖ్లాస్ మసీదుల నుంచి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు వక్ఫ్ బిల్లు రద్దు చేయాలని డిమాండ చేస్తూ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండుకు చేరుకుని బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్లు సవరణ రాజ్యాంగానికి విరుద్ధమని చెప్పారు. మసీదుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణకు బిల్లు సవరణతో విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఉపసంహరించుకునే వరకూ ఆందోళన చేస్తామన్నారు.

ఇలా బోరు వేయకండయ్యా బాబూ..!

- రేగుతున్న దుమ్ము
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



పలమనేరు-కుప్పం హైవేలో వాహనాలకు ఇబ్బందిగా మారిన బోర్ డ్రిల్లింగ్ దుమ్ము

పలమనేరు: భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో పంటలకు సాగునీటి కోసం రైతులు కొత్త బోర్లు వేస్తున్నారు. అయితే జాతీయ రహదారుల పక్కనున్న పొలాల్లో బోర్లను డ్రిల్ చేస్తూ నీరు రానప్పుడు వెలువడే ధూళి కారణంగా వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడంలేదు. పలమనేరు–కుప్పం రహదారి పక్కన ఓ వ్యక్తి తన పొలంలో శుక్రవారం బోరు డ్రిల్లింగ్ పనులకు పూనుకున్నాడు. ఆ బోరులో 800 అడుగులు డ్రిల్ చేసినా చుక్క నీరు రాకపోగా తీవ్రమైన రాతి దుమ్మురేచింది. ఆ దుమ్ము రోడ్డుపై కమ్ముకోవడంతో ఆ మార్గంలో వెళ్ళే వాహనాల డ్రైవర్లకు రోడ్డు కనిపించకుండా పోయింది. దీంతో వాహనాలను ఆపి మెల్లగా పోవాల్సి వచ్చింది. హైవేల సమీపంలో బోర్లను డ్రిల్ చేసేవారు పొగ రాకుండా ఫోం డ్రిల్లింగ్ లేదా నీటిని నాన్చుతూ డ్రిల్ చేయాల్సి ఉంది. అయితే అలా ఎవరూ చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పలమనేరు: ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన నేతలకు పాదాభివందనాలు తెలుపుతూ శుక్రవారం స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, మంద క్రిష్ణ మాదిగకు తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, పాండురంగయ్య, కృష్ణ, వెంకటాచలం, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



పంపు హౌస్ వద్ద నీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అలాగే పట్టణ ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు పంప్ హౌస్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను శుక్రవారం ఆయన సిబ్బందితో కలసి పరిశీలించారు. వస్తున్న నీటిని ఆదా చేసుకోవాలంటే పైపులైన్ల లీకేజీలపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణ సమీపంలోని నాగమంగళం పంపుహౌస్ వద్ద ఎండిన బోర్లను డీపెనింగ్, కొత్త బోర్ల డ్రిల్లింగ్ కార్యక్రమాలను రూ.20లక్షలతో చేపట్టామన్నారు.దీంతోపాటు ఆరు ట్యాంకర్లతో పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ స్నేహప్రియ, అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మూతబడిన మినరల్ వాటర్ ప్లాంట్

రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీ దద్దాలవారిపల్లెలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై మూత పడింది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి నిధులు రూ.5 లక్షలతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకు ప్లాంట్‌లోని యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. అయితే వీటి మరమ్మతుల గురించి అధికారులు గానీ ప్రజాప్రతి నిధులుగానీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్లాంట్‌ను మరమ్మతులు చేసి నీటి సౌకర్యం కల్పిస్తే వైఎస్సార్‌సీపీకి పేరు వస్తుందనే ఉద్దేశంతో మరమ్మతులు చేయకుండా కాలం గడుపుతున్నారనే విమర్శలొస్తున్నాయి. ప్లాంట్ పని చేయకపోవడంతో గ్రామస్తులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. రొంపిచెర్లకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు వారు చెప్పారు. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకుని వాటర్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తెచ్చి తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

గాలీవానకు కూలిన రేకుల ఇల్లు

- తల్లి, కుమారుడికి గాయాలు



నేతిగుట్లపల్లెలో గాలీవానకు కూలిన రేకుల ఇల్లు (ఇన్‌సెట్) గాయపడిన పూర్ణకుమార్, చంద్రకళ

పుంగనూరు: ఉరుములు, మెరుపులతో కూడిన గాలీ వాన ధాటికి ఓ రేకుల ఇల్లు పూర్తిగా దెబ్బతింది. రేకులు గాలి ధాటికి ఎగిరిపోయాయి. ఇల్లు కూలిపోవడంతో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి ఈ సంఘటన మండలంలోని నేతిగుట్లపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు.. నేతిగుట్లపల్లెకి చెందిన రమణ రేకుల ఇంటిలో తన భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. సాయంత్రం నుంచి తీవ్రమైన గాలులతో కూడిన వర్షం రావడంతో ఇంటిపై ఉన్న రేకులు గాలికి కొట్టుకుపోయి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న రమణ భార్య చంద్రకళ(35), అతని కుమారుడు పూర్ణకుమార్(15)లకు రేకులు, రాడ్లు పడి గాయాలయ్యాయి. గ్రామస్తులు ఇది గమనించి గాయపడిన వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇల్లు కూలిపోవడంతో రమణ కుటుంబం వీధిన పడింది. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైల్వే పనులు ఎందుకింత ఆలస్యం..?

చిత్తూరు కార్పొరేషన్: అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వీటిని పర్యవేక్షించడానికి శుక్రవారం చిత్తూరుకు ఆ శాఖ స్టేషన్ డెవలప్‌మెంట్ విభాగం సీఈ మల్లికార్జున వచ్చారు. పరిసరాలను, పనులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పనులు ఎందుకింత ఆలస్యమవుతున్నాయని అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ఇలాగే ఉంటే ఎప్పుడు పూర్తి చేస్తారు? అని ప్రశ్నించారు. దాదాపు ఒకటిన్నర సంవత్సరం పైగా పనులు చేస్తున్నా ఇప్పటికీ 50 శాతం కూడా పనులు కాలేదని చెప్పారు.